క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రామన్నపేట : నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్‌లో ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ శాఖల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు తాత్కాలికగా భర్తీ చేయుట కు దరఖాస్తులు రాహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు సమర్పణకు నేడు (మంగళవారం) ఆఖరి తేదీ అని పేర్కొన్నారు. వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను నేరుగా సంప్రదించవచ్చని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నగరంలోని ఈద్గా, పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ, నయీంనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ప్లాంటేషన్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని అవెన్యూ ప్లాంటేషన్, జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్తంగా ఈనెల 5న విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియం ప్రాంతంలో ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్ల కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం సోమవారం తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొనాలని కోరారు.

రేపు జయశంకర్ స్మారకోపాన్యాసం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ, డాక్టర్ కె.జయశంకర్ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఉదయం 11 గంటలకు క్యాంపస్‌లోని పరిపాలనా భవనం సెనేట్‌హాల్‌లో జయశంకర్ స్మారకోపాన్యాస కార్యక్రమం ఉంటుందని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెవలప్‌మెంట్ డిస్పరిటీస్ అండ్ దిపర్‌ఫ్రార్మెన్స్ ఆఫ్ ది సోషల్ సెక్టార్ ఇన్ ది సౌథర్న్ స్టేట్స్ ఆఫ్ ఇండియా అనే అంశంపై హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు డి నర్సింహారెడ్డి స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి కేయూ వీసీ ఆచార్య కె ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

కేయూ రిజిస్ట్రార్‌కు వినతి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ బాధ్యులు సోమవారం కేయూ రిజిస్ట్రార్ రామచంద్రంకు వినతిపత్రం సమర్పించారు. రిజిస్ట్రార్‌ను కలిసి విన్నవించిన వారిలో సీఐటీ యూ అధ్యక్షుడు రాంచందర్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేశ్



హన్మకొండ : బహుజన్ రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పూరెల్ల రమేశ్‌ను నియమించినట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. బహుజన ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్న హనుమకొండ జిల్లా నడికూడ మండలం కౌకొండకు చెందిన రమేశ్‌ను కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. బహుజనులను సమీకరించి పార్టీని పటిష్టం చేయనున్నట్లు రమేశ్ తెలిపారు.

టీ జీపీ ఎంప్లాయీస్ జిల్లా కమిటీ ఎన్నిక





అధ్యక్ష,కార్యదర్శులు యాకయ్య, రామన్న

హన్మకొండ చౌరస్తా : తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం అలంకార్ జంక్షన్‌లోని టీఎన్జీఓఎస్ భవన్‌లో జరిగినట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి తెలిపారు. అధ్యక్షుడిగా గబ్బెట యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా పల్లె రామన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బండ సాంబయ్య, కోశాధికారిగా బోగం రమేష్, ఉపాధ్యక్షులుగా భాస్కర్, కుమారస్వామి, సుఖేందర్, సుశీల, రాజు, కార్యదర్శులుగా ఏసుబ్, సుందర్, ఫిలిప్, రూప, రమేష్, ఐలయ్య సభ్యులు ఎన్నికైనట్లు చక్రపాణి తెలిపారు.

ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుపై ఫిర్యాదు

ఖిలా వరంగల్ : నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ డీమ్డ్ యూనిర్సిటీలు, మెడికల్ ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుపై న్యూఢిల్లీలోని నేషనల్ మెడికల్ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోప భూయిష్ట విధానాలతో ఏర్పాటైన రెండు డీమ్డ్ యూనివర్సిటీ వల్ల తెలంగాణలో (550) ఎంబీబీఎస్ సీట్లు ప్రభుత్వ కోటాకు కోతపడటం, అర్హులైన విద్యార్థులు నష్టపోతారన్నారు.

ఎమ్మెల్యేల మధ్య ఇసుక దుమారం!

- రేవూరి ప్రకాష్‌రెడ్డి వర్సెస్ గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లి వాగుల ఇసుక పరకాలకు వెళ్లకుండా ఎమ్మెల్యే ఆంక్షలు?
- పరకాల ఎమ్మెల్యే అడిగినా ససేమిరా అంటున్న గండ్ర
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి 'పొంగులేటి' వద్దకు చేరిన పంచాయితీ



ఆంక్షలు..

సాక్షిప్రతినిధి, వరంగల్/పరకాల: అధికార పార్టీకి చెందిన పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణల నడుమ ఇసుక సరఫరా విషయంలో మాటల యుద్ధం జరిగిందా..? పరకాల నియోజకవర్గానికి భూపాలపల్లి నియోజకవర్గంలోని వాగులనుంచి ఇసుక తరలింపు నిలిచిపోయిందా? ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఉచిత ఇసుక సరఫరా విషయంలో మొదలైన ఈ పంచాయితీ పార్టీ కార్యకర్తల వరకు పాకిందా?.. అంటే నిజమే అంటున్నారు కాంగ్రెస్ పార్టీ కేడర్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు. కొద్ది రోజులుగా భూపాలపల్లి నియోజకవర్గంలోని వాగులనుంచి పరకాల నియోజకవర్గానికి ఇసుక తరలకుండా రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు గస్తీ కాయడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిల మధ్య ఇసుక రవాణాపై సంభాషణ జరిగినా ఫలితం లేకపోవడంతో చివరకు ఈ పంచాయితీ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి వద్దకు వెళ్లిందన్న ప్రచారం చర్చనీయాంశంగా మారింది.

భూపాలపల్లి ఇసుక.. పరకాలకు తరలకుండా

అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలనెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వమే ఉచితంగా ఇసుక తరలింపునకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సమీప ప్రాంతాల్లో ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడి నుంచి సరఫరా చేయాలని సూచించింది. భూపాలపల్లి నియోజకవర్గంలోని ఏ ఒక్క వాగునుంచి ఇసుక ట్రాక్టర్ పరకాలకు తరలివెళ్లకుండా రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు కట్టడి చేస్తున్నారు. మండలాల సరిహద్దుల్లో సంబంధిత పోలీస్‌స్టేషన్ల సిబ్బంది రాత్రివేళలో మఫ్టీలో సంచరిస్తూ ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నారని పరకాల వాసులు చెబుతున్నారు. కేసులు పెట్టడానికి కూడ వెనుకడుగు వేయకపోవడంతో, దీంతో పరకాలకు ఇసుక తరలింపు నిలిచిపోయిందని అంటున్నారు. ఇదేంటని అడిగితే పోలీసు, రెవెన్యూ అధికారులు పరకాలకు ఇసుక వెళ్తే చర్యలు తీసుకోవాలంటూ భూపాలపల్లి ఎమ్మెల్యేనుంచి ఆదేశాలున్నాయని చెబుతున్నారని పరకాల కాంగ్రెస్ నేతలు అంటున్నారు. దీంతో చిట్యాల మండలంలోని టేకుమట్ల, కాల్వపల్లి, కలకోటపల్లి, మొగుళ్లపల్లి మండలంలోని నవాబుపేట, ఇస్సిపేట, కొర్కిశాల, రేగొండ మండలంలోని కనపర్తి వాగుల నుంచి పరకాలకు ఇసుక తరలించకుండా ఆంక్షలు విధించినట్లు సమాచారం.

ఆకాశన్నంటిన ఇసుక ధర..

గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఇసుక క్వారీలు 15 ఉండగా, వర్షాల కారణంగా అందులో 14 క్వారీలు నీట మునిగాయి. మిగతా ఒక్కటి అడవి సోమన్నపల్లి నుంచి మాత్రమే ఇసుకను తరలిస్తున్నారు. గతంలో ఒక్కో టన్నుకు రూ.800 నుంచి రూ.1000 ఉండగా ప్రస్తుతం మూడు రెట్లు అంటే రూ.2,500 వరకు నడుస్తుంది. అంటే ఒక్కో లారీ 32 టన్నులు అంటే రూ.80వేలు అవుతుంది. అంత ధర సామాన్యుడు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో పొరుగు జిల్లానుంచి, వాగుల నుంచి ఇసుక తరలించుకోవడంపై ఆంక్షలు విధించడం పరకాల నియోజకవర్గంలోని తమ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌చార్జ్ మంత్రి వద్దకు ఇసుక పంచాయితీ

భూపాలపల్లి, పరకాల ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్రకాష్‌రెడ్డిల మధ్య నెలకొన్న ఇసుక పంచాయితీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరకు వెళ్లినట్లు తెలిసింది. భూపాలపల్లి నుంచి ఇసుక రాకుండా ఆంక్షలు విధించడంపై మొదట ఎమ్మెల్యే సత్యనారాయణతో మాట్లాడిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్రెడ్డి.. ఫలితం లేకపోవడంతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి... ఈ మధ్యలో నిర్వహించే రివ్యూ మీటింగ్‌లో భూపాలపల్లి ఎమ్మెల్యేతో మాట్లాడతానని చెప్పినట్లు సమాచారం. కాగా, ఇన్‌చార్జ్ మంత్రి జోక్యంతోనైనా పరకాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సమస్య తీరుతుందా..? లేదా? అనేది చూడాలి మరి.

ఓపెన్ టు ఆల్ చెస్ విజేత అభినవ్‌సాయి

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సహకారంతో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో అభినవ్‌సాయి దామెర విజేతగా నిలిచాడు. ద్వితీయ స్థానంలో షేక్ రియాజ్, తృతీయ స్థానంలో విజయ చందర్‌రెడ్డి నిలిచినట్లు టోర్నమెంటు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు.

రుద్రాక్ష ఎగ్జిబిషన్ ప్రారంభం



రుద్రాక్షలు పరిశీలిస్తున్న బంక సరళ

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన రుద్రాక్ష ఎగ్జిబిషన్‌ను సోమవారం మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో నేపాల్ రుద్రాక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తమ వద్ద రుద్రాక్ష, కరుంగళి, కరుంగళి వెండితో తయారు చేసిన మాలలు, బ్రాస్‌లెట్‌లు దక్షణావృత శంకులు, సాలిగ్రాంలు ఈ ప్రదర్శనలో ఉన్నాయని వివరించారు. పుట్టిన తేదీ, జాతకాన్ని పరిశీలించి జన్మరాశి, జన్మనక్షత్రానికి సరిపడే రుద్రాక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 9 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి తేళ్ల సుగుణ, జి.పద్మలత పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



రామన్నపేట : ఉర్సులోని బీరన్న దేవాలయంలో బొగ్గరపు రామకృష్ణ సమక్షంలో శిల్పా పుట్టినరోజు సందర్భంగా భర్త వడ్లకుంట రాఘవేంద్ర, కుమార్తె అభినయ చేతుల మీదుగా ముగ్గురు దివ్యాంగులకు వీల్ చైర్లను ఉచితంగా పంపిణీ చేశారు. దాతల సహాయంతో నిరుపేద దివ్యాంగులకు ఉచితంగా వీల్ చైర్లు ఇప్పిస్తున్న రామకృష్ణకు, వారికి సహకరిస్తున్న దాతలకు, వారి కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలతో ఉంటూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని దివ్యాంగుల సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు ఎండి అజీమ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బండి చక్రపాణి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి బత్తిని రాజు, కుమ్మరి శారద, తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



హన్మకొండ : పేదరికం విద్యకు ఆటంకం కాకూడదని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కె.అనితారెడ్డి అన్నారు. సోమవారం సుబేదారిలోని ప్రభుత్వ బాలసదనంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు ఉచితంగా నోట్‌బుక్స్, స్టేషనరీను ఆమె అందించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ భావించి బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న అనాథ బాలలకు ఉచితంగా వీటిని అందిచామన్నారు. వీటితో పాటు ఫీజులు చెల్లిస్తున్నానని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా క్రమశిక్షణతో సాధన చేస్తే లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వార్డెన్ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్

- ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్

హసన్‌పర్తి : పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ అన్నారు. నగరంలో ఎస్‌వీఎస్ కళాశాలలో ఫస్టియర్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతీ కళాశాలకు హాజరై అభ్యసిస్తే డిప్లొమా విద్య చాలా సులువని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. కళాశాల డైరెక్టర్ ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అమెరికా పర్యటనలో ఉన్నారన్నారు. అక్కడ వివిధ యూనివర్సిటీలతో ఒప్పందం కుదుర్చుకోవడానికి వెళ్లారని చెప్పారు. విద్యార్థులు 90 శాతం హాజరు కలిగి ఉండాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కాళీదాస్ పోరాటాలతోనే కోచ్ ఫ్యాక్టరీ

ఖిలా వరంగల్: సీపీఐ నేత మడత కాళీదాస్ పోరాటాల వల్లే కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా అన్నారు. కాళీదాస్ 5వ వర్ధంతి సందర్భంగా సోమవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జరిగిన సమావేశంలో కాళీదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.

స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో యూత్ ఫర్ సేవా సంస్థకు చెందిన మల్లికార్జున్ సోమవారం 200 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, జామెట్రీ బాక్సులు, పెద్ద బాలశిక్ష తదితర వస్తువులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం జీవీ రామారావు మాట్లాడారు.

సమసమాజానికి కమ్యూనిస్టులు పోరాడాలి

కాజీపేట : శ్రమజీవుల హక్కులు, కుల, మతాంతరాలు లేని సమ సమాజం కోసం కమ్యూనిస్టులు పోరాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చుక్కయ్య అన్నారు. పట్టణంలోని ఆఫీస్‌లో సోమవారం ఫాతిమానగర్ శాఖ సమావేశం నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసిన కార్పొరేటర్

కాజీపేట : 63వ డివిజన్ విద్యానగర్ కాలనీ, జూబ్లీ మార్కెట్ ప్రాంతాల్లో సోమవారం కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోశారు.

ఓ సిటీలో అక్రమ పార్కింగ్ తొలగించండి

నయీంనగర్ : వరంగల్ ఓ సిటీలో నిత్యం లారీలు, ప్రైవేట్ బస్సులు, భారీ వాహనాలు అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారని, వ్యర్థ పదార్థాలను డంపింగ్ చేస్తున్నారని సోమవారం కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డికి ఓ సిటీవాసులు వినతిపత్రం ఇచ్చారు. అక్రమ పార్కింగ్ చేయకుండా కుడా తరఫున చర్యలు తీసుకోవాలని కోరారు.

రచయిత కాసర్ల శ్యామ్‌కు సన్మానం

హన్మకొండ: ప్రముఖ రచయిత, ఎన్నో సినిమాలకు పాటలు అందించిన వరంగల్ వాసి కాసర్ల శ్యామ్‌ను తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి సన్మానించారు. బలగం సినిమాలో రాసిన ఊరు పల్లెటూరు పాటకు బెస్ట్ లిరిక్స్ కేటగిరీలో జాతీయ అవార్డు ప్రకటించిన క్రమంలో సోమవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో శ్యామ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

వినాయక నిమజ్జనం ప్లాట్‌ఫామ్ పరిశీలన

ఖిలా వరంగల్ : కరీమాబాద్‌లోని ఉర్సుగుట్ట రంగసముద్రం చెరువు వద్ద నిలిచిపోయిన వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం నిర్మిస్తున్న ప్లాట్‌ఫామ్‌ను సోమవారం కార్పొరేటర్ రవి పరిశీలించారు.ప్లాట్‌ఫామ్ ఇప్పటికే కుంగి పోయి కూలిపోయేందుకు సిద్ధంగా ఉందన్నారు. బల్దియా అధికారులు పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి : ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు.

విద్యారంగ సమస్యలు ..

విద్యారణ్యపురి : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యాశాఖమంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ మాట్లాడారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

న్యూశాయంపేట : వరంగల్ జిల్లాలోని ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐ టీయూ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ బషీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

కాంస్య పతక విజేతకు సన్మానం

కేయూ క్యాంపస్ : ఇటీవల మలేషియాలో జరిగిన ఏషియన్ పారా థైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన పరిశోధకురాలు మాచర్ల కృష్ణవేణిని సోమవారం కేయూలోని ప్రభుత్వ పాలనా, మానవవనరుల విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్, అధ్యాపకులు దుశ్శాలుతో సన్మానించారు.

కాజీపేట జంక్షన్‌లో స్వచ్ఛఅభియాన్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో సోమవారం రైల్వే అధికారులు భారతీయ రైల్వే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు–2025ను పురస్కరించుకొని స్వచ్ఛ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రైల్వే చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌నాయక్, రైల్వేస్టేషన్ మేనేజర్ రవీందర్, రైల్వే సీసీఐ అరుణ్ శౌరి, రైల్వే సీబీఎస్‌ఆర్ సజ్జన్‌లాల్‌లు ప్రయాణికులకు స్వచ్ఛ అభియాన్‌పై అవగాహన కల్పించారు.

సీసీ రోడ్డు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలి

రామన్నపేట : నగరంలోని 32వ డివిజన్ మల్లు స్వరాజ్యం నగర్‌లో సీసీ రోడ్డు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ కరీమాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కాలనీవాసులతో కలిసి జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

నాలాలు కబ్జా చేశారని ఫిర్యాదు

హసన్‌పర్తి : భీమారంలోని శ్యామల చెరువు నుంచి వెళ్తున్న నాలాలు కబ్జాకు గురయ్యాయని స్థానికులు కోరారు. సోమవారం గ్రీవెన్స్‌లో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

హసన్‌పర్తి: మండలంలోని ముచ్చర్లకు చెందిన ఓ యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి జరిగింది. ముచ్చర్లకు చెందిన మట్టెడ అభిషేక్(28), ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

సీసీ కెమెరాలతోనే రక్షణ

- దాతల చేయూత అభినందనీయం
- రూ.2 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు
- ప్రారంభించిన ఏసీపీ శుభం



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శుభం

ఖిలా వరంగల్ : సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకుంటే కాలనీలకు భద్రత, ప్రజలకు రక్షణగా ఉంటుందని వరంగల్ ఏసీపీ శుభం సూచించారు. సోమవారం శివనగర్ 34, 35 డివిజన్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శివ విఘ్నేశ్వర ఆలయం, నాలుగు జెండాల కాలనీల్లో రూ.2లక్షల వ్యయంతో దాత, సామాజిక సేవకుడు మేరుగు అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్, పద్మశాలి అధ్యక్షుడు గడ్డం రవి, హెచ్‌ఎం నరేంద్రచారీలతో కలిసి ఏసీపీ ప్రారంభించి మాట్లాడారు. కాలనీల ప్రజల కమిటీలను ఏర్పాటు చేసుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఏదైన ఘటన జరిగిన క్షణాల్లో సీసీ పుటేజీల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని సూచించారు. దాతలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ సూచించారు. అనంతరం సీసీ కెమెరాల దాత మేరుగు అశోక్‌ను ఏసీపీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివ, రాజమౌళి, శ్యామ్, యాదగిరి, రాంపెల్లి ఉపేందర్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ రమేష్, చారీ, నే పాల్‌రాజు, కొయ్యాడ శ్రీధర్‌గౌడ్, శీలం అశోక్ రెడ్డి, కాసం రాజు, సతీష్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు బీజేపీనే అడ్డంకి

- సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కెళ్లపల్లి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : బీసీ రిజర్వేషన్లకు బీజేపీ ప్రధాన అడ్డంకి అని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ బీజేపీని అడ్డుకునేందుకు వామపక్షాలను బలోపేతం చేయాలని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని ఆరోపించారు. పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బీసీలు బీజేపీకి బుద్ధి చెప్పాలని అన్నారు. ఈనెల 19 నుంచి నాలుగు రోజుల పాటు మేడ్చల్ జిల్లాలో నిర్వహించే పార్టీ రాష్ట్ర మహాసభలను ప్రతీ ఒక్కరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు బిక్షపతి, కరుణాకర్, శ్రీనివాస్, సదాలక్ష్మి, స్టాలిన్, ఎల్లేష్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయాలి



గోవాకు తరలివెళ్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

హన్మకొండ : రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవి కృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. గోవాలో ఈ నెల 7న జరిగే జాతీయ ఓబీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఓబీసీ జాతీయ మహాసభకు తరలివెళ్తున్న బీసీల వాహనాన్ని బైరి రవి కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలో చర్చించి కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి పదివేల మంది ఓబీసీ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, నాయకులు యాదగిరి, అశోక్, మధు, పాల్గొన్నారు.

ఊపిరి అందించి ప్రాణాలు కాపాడారు



శిశువుతో వైద్యులు, సిబ్బంది

హన్మకొండ చౌరస్తా : చాలా కాలం తర్వాత సంతానం కల్గిన దంపతులకు పుట్టిన శిశువుకు ఊపిరి అందించి ప్రాణాలను కాపాడినట్లు హనుమకొండలోని డాల్ఫిన్ ఆస్పత్రి డాక్టర్ ప్రవీణ్ సోమవారం తెలిపారు. సంగెం మండలం గాడిపెల్లికి చెందిన ప్రవళిక–మహేష్ దంపతులకు 8 ఏళ్ల తర్వాత సంతానం కలిగినట్లు డాక్టర్ తెలిపారు. ఇద్దరు కవల పిల్లలు ఉండడంతో పీటర్ స్కాన్ చేయగా ఒకరికి కాంజినేటల్ డయాఫ్రమేటిక్ హెర్నియా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వరంగల్‌లోని క్యూర్‌వెల్ ఆస్పత్రిలో ప్రసవించగా ఒక శిశువు, డాల్ఫిన్ ఆసుపత్రికి పంపించారు. ఆ శిశువు 1.6 కిలోగ్రాముల బరువుతో జన్మించగా ఊపిరితిత్తుల్లో పేగులు అడ్డుపడడంతో శ్వాసతీసుకోవడం ఇబ్బందిని గుర్తించారు. దీంతో తగిన ఆపరేషన్ చేసి ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు. డాక్టర్ ప్రవీణ్‌తో పాటు వైద్యులు సిద్దార్థరెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

ప్రజలే గద్దర్ వారసులు

- దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

హన్మకొండ: ప్రజలే గద్దరన్న వారసులని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజాయుద్ధనౌక గద్దర్ ద్వితీయ వర్ధంతి పోస్టర్లను హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్రభారతిలో గద్దర్ ద్వితీయ వర్ధంతి సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు కవులు, కళాకారులు, మేధావులు పాల్గొననున్నారని తెలిపారు. విద్యార్థులు, మేథావులు, అంబేడ్కర్‌వాదులు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, కార్మిక కర్షకులు, బహుజన విప్లవ సానుభూతిపరులు భారీ సంఖ్యలో తరలివచ్చి గద్దర్‌కు శ్రద్ధాంజలి ఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్‌రావు, కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేశ్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, న్యాయవాది మహేందర్, ప్రజా సంఘాల నాయకులు ఎం.సుదర్శన్, రాజు, కిరణ్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

రైలులో ఢిల్లీకి వెళ్తున్న నేతలకు స్వాగతం

- కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న ఎమ్మెల్యేలు

కాజీపేట రూరల్ : ఢిల్లీలో ఈ నెల 5, 6, 7వ తేదీల్లో జరిగే బీసీ రిజర్వేషన్ల పోరాట కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైల్లో వెళ్తున్న ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు కలిసి స్వాగతం పలికేందుకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నాయకత్వంలో నేతలు సోమవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ సమయానికి ప్రత్యేక రైలు రాకపోవడం, జంక్షన్‌లో ఢిల్లీ వెళ్తున్న నేతలకు ఇక్కడ హాల్టింగ్ లేదని, ఆగరనే సమాచారం తెలువడంతో అక్కడికి వచ్చిన స్థానిక నాయకులు తిరిగి వెళ్లిపోయారు. కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న వారిలో ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ అంకూస్, నాయిని లక్ష్మారెడ్డి, బంక సంపత్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీరజాలి, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. దీంతో ఉదయం 11:55 గంటలకు చేరుకున్న ప్రత్యేక రైలు డ్రైవర్ చేంజింగ్ కోసం 2 నిమిషాలు ఆగి ఢిల్లీ వైపు వెళ్లిపోయింది.

బాలాజీనగర్ నూతన కమిటీ

కాజీపేట రూరల్ : 47వ డివిజన్ బాలాజీనగర్‌లో పోచమ్మగుడి ఆవరణలో సోమవారం బాలాజీనగర్ సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా ప్రవీణ్, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, విజయ్‌కుమార్ వ్యవహరించారు. పసునూరి మనోహర్, రవికుమార్, యాదగిరి, రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా కంకణాల సురేందర్, కోశాధికారిగా పొక్కుల సమ్మయ్యలు ఎన్నికల్లో గెలుపొందారు. గెలిచిన నూతన కమిటీ వారు బాలాజీనగర్ సొసైటీ ప్రజల సహకారంతో అభివృద్ధిలో భాగస్వాములమై అందరిని కలుపుకొని పని చేస్తామని హామి ఇచ్చారు.